సాక్షి
యాదాద్రి భువనగిరి
7
ఆదివారం । 30 । మార్చి । 2025



కార్మికుల నుంచే కాంగ్రెస్ పతనం
పీఈఎల్ కార్మికుల నుంచే కాంగ్రెస్ పతనం మొదలైందని బీఆర్ఎస్‌కేవీ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి అన్నారు. - 9లో



'శ్రీవిశ్వావసు నామ'కు స్వాగతం
ఆత్మీయ అనుబంధాలను గుర్తు చేసే తెలుగింటి తొలి పండుగ ఉగాది. జీవితంలో కష్టసుఖాలు చవిచూపిస్తూ షడ్రుచుల కలబోతగా పులకరింపజేసే తెలుగు సంవత్సరాది. శ్రీవిశ్వావసు నామ సంవత్సరం అందరికీ శుభం చేకూర్చాలని ఆకాంక్షిద్దాం.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ 6-35 (ఆదివారం సా॥)
సహర్ 4-50 (సోమవారం ఉ॥)

మార్పు మన చేతుల్లోనే..

- కొత్త సంవత్సరంలో సరికొత్త ఆలోచనలతో ముందుకెళ్లండి
- కలెక్టర్ హనుమంతరావు
- జిల్లా ప్రజలకు శ్రీ విశ్వావసు నామ సంవత్సర శుభాకాంక్షలు



సాక్షి యాదాద్రి : 'ప్రతీ ఉగాదికి కొత్త పంచాంగం, కొత్త రాశిఫలాలు వస్తుంటాయి.. వీటిని చూసి కొందరు నూతన సంవత్సరంలో నా జీవితం మారాలి అని అనుకుంటారు. కానీ, మార్పు అనేది మన చేతుల్లోనే ఉంటుంది.. కొత్త ఏడాదితో మార్పు రాదు' అని కలెక్టర్ హనుమంతరావు తెలిపారు. ఉగాది సందర్భంగా ఆయన శనివారం 'సాక్షి'తో మాట్లాడారు. యువత కొత్త సంవత్సరంలో షడ్రుచులను ఆస్వాదించాలని, తమ ఆశలు, ఆశయాలు, ఆలోచనలు, కలలను సాకారం చేసుకోవాలని సూచించారు. నిరంతర సాధనతో సాధ్యంకానిది ఏదీ ఉండదన్నారు. మనం సాధించే విజయాల గురించి సమాజం నాలుగు కాలాలు మాట్లాడుకోవాలన్నారు. చేదు జ్ఞాపకా లను వదిలి ఆత్మస్థైర్యంతో భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలన్నారు. ప్రజలకు శ్రీ విశ్వావసు నామ సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.


మహనీయుల జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి

భువనగిరిటౌన్ : మహనీయుల జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ హనుమంతరావు పేర్కొన్నారు. బాబు జగ్జీవన్‌రామ్, బీఆర్ఎస్ అంబేద్కర్ జయంతి సందర్భంగా శనివారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులు, వివిధ కుల సంఘాల నాయకులతో సన్నాహక సమావేశం నిర్వహించారు.

రాజపూజ్యమేనా..!

మంత్రివర్గ విస్తరణ ముహూర్తాన ఆశావహుల జాతకాలపై చర్చ

- ఉమ్మడి జిల్లా నుంచి కేబినెట్ రేసులో ముగ్గురు
- ఆ ముగ్గురి జాతకాలూ ఓకే అంటున్న పంచాంగకర్తలు
- విశ్వావసునామ సంవత్సరం.. వీరి రాజకీయ జీవితంలో కీలకం



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: జాతకం... పంచాంగం అనగానే ఎవరైనా ఆదాయ, వ్యయాల లెక్కల గురించే ఆసక్తి కనబరుస్తారు. ఉగాది పర్వదినం సందర్భంగా అయితే ప్రతి ఒక్కరూ తెలుగు పంచాంగం పుస్తకం ముందేసుకుని మరీ తమకు ఈ ఏడాది కలసి వస్తుందా... రాదా? అన్నది ఆసక్తిగా చూసుకుంటారు. ఆదాయం 10 ఉండి వ్యయం 2 ఉంటే ఈ ఏడాది తిరుగులేదని, బాగా వెనుకేసుకోవచ్చని భావిస్తారు. అదే ఆదాయ, వ్యయ అంచనాలు తిరగబడితే ఉసూరుమంటారు. ఇదంతా సామాన్య ప్రజలకు సంబంధించింది మాత్రమే. అదే, రాజకీయ నాయకులయితే ఆదాయ, వ్యయాలను పట్టించుకోరు. పంచాంగం ప్రకారం రాజపూజ్యం ఎంత, అవమానం ఎంత అనేదానికే ప్రాధాన్యమిస్తారు. అది కూడా ఏదో ఒక ఉన్నత పదవి వస్తుందన్న ముహూర్తంలో అయితే ఈ పంచాగ లెక్కలకు ఎనలేని ప్రాధాన్యమిస్తారు. అలాంటి రాజకీయ నాయకుల జాబితాలో ప్రస్తుతం మన జిల్లాలో ముగ్గురు ఉన్నారు. రాష్ట్రంలో మంత్రివర్గ విస్తరణకు కాంగ్రెస్ అధిష్టానం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిందని, త్వరలోనే కొత్త మంత్రులు ప్రమాణం చేస్తారన్న వార్తల నేపథ్యంలో ఈ ముగ్గురి పంచాంగానికి, వారి జాతకం ఎలా ఉంటుంది.. విశ్వావసునామ సంవత్సరం వీరికి ఎలా కలసిరాబోతోందన్న దానిపై ఆసక్తికర చర్చ జరుగుతోంది. ఆ ముగ్గురు ఎవరో కాదు... మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్, కోదాడ ఎమ్మెల్యే నలమాద పద్మావతిరెడ్డి. వీలుంటే మంత్రిపదవి లేదంటే ఇంకేదైనా ఉన్నత పదవి రేసులో ఉన్న ఈ ముగ్గురి జాతకాలు ఎలా ఉన్నాయో ఓ లుక్కేద్దాం..

నేనావత్ బాలునాయక్

మంత్రి పదవితో పాటు డిప్యూటీ స్పీకర్ రేసులో ఉన్న దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ పేరును బట్టి ఆయన ధనూరాశి. ఆయనకు కూడా విశ్వావసునామ సంవత్సరంలో రాజకీయంగా కలిసి వస్తుందని పంచాంగం చెబుతోంది. ఇక ఆయనకు ఆదాయం 5, వ్యయం 5గా, రాజపూజ్యం 1, అవమానం 5గా జాతకంలో ఉంది.

కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

మంత్రి రేసులో ముందున్న ఎమ్మెల్యే ఈయన. పేరును బట్టి రాజగోపాల్‌రెడ్డిది తులా రాశి. ఈ రాశి వారికి ఈ ఏడాది బాగానే కలసివస్తుందని పంచాంగం చెబుతోంది. ఈ ఏడాదిలో ఆయన జాతకం పూర్తిగా మారిపోతుందని, రాజకీయంగా పురోగతిలో పయనిస్తారని ఆయన జా తకం వెల్లడిస్తోంది. మే 15వ తేదీ నుంచి ఆయనకు కాలం మరింతగా కలిసి వస్తుందని తెలుగు పంచాంగం చెబుతోంది. ఆయనకు ఆదాయం 11 ఉంటే, వ్యయం 5గా ఉంది. రాజ పూజ్యం 2, అవమానం 2గా ఉంది.

నలమాద పద్మావతిరెడ్డి

మంత్రి పదవితో పాటు డిప్యూటీ స్పీకర్ రేసులో ఉన్న కోదాడ ఎమ్మెల్యే నలమాద పద్మావతిరెడ్డిది కన్యా రాశి. ఆమెకు కూడా జాతకపరంగా పరిస్థితులు బాగానే ఉన్నాయి. ఆమెకు ఆదాయం 14కాగా, ఖర్చు 2గా ఉందని, రాజపూజ్యం 6, అవమానం 6గా ఉందని పంచాంగం చెబుతోంది. ఈ ముగ్గురి జాతకాల్లో ఏమి ఉన్నా... రాజకీయ పరిస్థితుల పరంగా విశ్వావసునామ సంవత్సరమే కీలకం కానుంది. ఈ ఏడాది ముగిసే నాటికి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు పూర్తి కానుంది. మరో ఏడాదిన్నర తర్వాత మళ్లీ ఎన్నికల హడావుడి వచ్చేస్తుంది. ఈ ఏడాది తర్వాత కేబినెట్ స్థాయి మార్పులు కూడా ఉండే అవకాశం లేదని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్న నేపథ్యంలో విశ్వావసు నామ సంవత్సరం వీరిని ఎక్కడకు తీసుకెళ్తుందో వేచి చూడాల్సిందే...

- ఈ జాతక అంచనాలు కేవలం వారి పేరు ప్రకారం పంచాంగకర్తలు చూసింది మాత్రమే. కానీ, వారి వారి పుట్టిన తేదీ, సమయం, నక్షత్రం, పాదం ఆధారంగానే అసలైన పంచాగం చూడగలమని, ఆ వివరాల ద్వారానే వారి జాతకం ఆధారపడి ఉంటుందనేది పంచాంగకర్తల మాట.

దరఖాస్తుల ఆహ్వానం

భువనగిరి టౌన్ : కొండాలక్ష్మణ్ బాపూజీ ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీలో 2025–26 విద్యా సంవత్సరానికి గాను డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాల కోసం దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా చేనేత,జౌళి శాఖ సహాయ సంచాలకులు శ్రీనివాసరావు శనివారం ప్రకటనలో తెలిపారు కోర్సు కాలం మూడు సంవత్సరాలు ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని, వివరాల కోసం చేనేత, జౌళి శాఖ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

నేడు హుజూర్‌నగర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి

- సన్నబియ్యం పంపిణీని లాంఛనంగా ప్రారంభించనున్న ముఖ్యమంత్రి
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు



సిద్ధమైన బహిరంగ సభా వేదిక

హుజూర్‌నగర్ : నిరుపేదలు కడుపునిండా తినాలంటే రేషన్‌షాపుల ద్వారా సన్నబియ్యం ఇవ్వడమే మేలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా ఉచితంగా అందించే ఈ సన్నబియ్యం పంపిణీ పథకాన్ని ఉగాది పర్వదినం రోజైన ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా హుజూర్‌నగర్‌లో శ్రీకారం చుట్టనున్నారు. రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఇక్కడ భారీ బహిరంగ సభ నిర్వహించి సభావేదికపైనే రేషన్ లబ్ధిదారులకు ఉచిత సన్నబియ్యం పంపిణీని సీఎం ప్రారంభిస్తారు. దాదాపు 15 ఎకరాల స్థలంలో బహిరంగ సభ నిర్వహించనున్నారు. సుమారు 50 వేలమంది వస్తారనే అంచనాతో ఏర్పాట్లు చేస్తున్నారు. సభా వేదిక, దాని పక్కన కళావేదిక, వీఐపీలు, మహిళలు, మీడియాకు ప్రత్యేక గ్యాలరీలు ఏర్పాటు చేశారు. సభా ప్రాగణంలో డిజిటల్ స్క్రీన్‌లు ఏర్పాటు చేశారు. నల్లగొండ గద్దర్ కళాకారుల బృందంతో ప్రత్యేక కార్యక్రమ నిర్వహణకు వేదిక రూపొందించారు. ట్రాఫిక్ అంతరాయం లేకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, ఎస్పీ నరసింహ, వివిధ శాఖల అధికారులు కలిసి ఏర్పాట్లు పూర్తి చేశారు.

ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి ఉత్తమ్

సీఎం సభ ఏర్పాట్లను మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి శనివారం పరిశీలించారు. సభావేదిక, సభా ప్రాంగణం, గ్యాలరీ, పార్కింగ్, హెలిప్యాడ్‌లు, సీఎం వాహనాల రాకపోకల అప్రోచ్ రోడ్లు, మోడల్ కాలనీలో సీఎం రాకపోకల ఏర్పాట్లను పరిశీలించారు. ఏర్పాట్లపై అధికారులతో మంత్రి చర్చించి పలు సూచనలు చేశారు.

టీజీఆర్ఎస్ఏ నూతన కార్యవర్గం ఎన్నిక



కె.వెంకట్‌రెడ్డి, అధ్యక్షుడు



బి.పల్లవి, ప్రధాన కార్యదర్శి

భువనగిరిటౌన్ : తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ (టీజీఆర్ఎస్ఏ) జిల్లా నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కె. వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బి.పల్లవి, అసోసియేట్ అధ్యక్షుడిగా మల్లిఖార్జున్‌రావు, మహిళా విభాగం అధ్యక్షురాలిగా బాలమణి, కోశాధికారిగా హరికృష్ణారావు ఎన్నికయ్యారు.

తహసీల్దార్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా రవికుమార్..



పి.రవికుమార్

తెలంగాణ తహసీల్దార్ల అసోసియేషన్ జిల్లా కమిటీ అధ్యక్షునిగా పి.రవికుమార్, ప్రధా న కార్యదర్శి పి.శ్రీనివాస్‌రెడ్డి నియమితులయ్యారు. రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు లచ్చిరెడ్డి, అధ్యక్షుడు రాంరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

గుత్తా సుఖేందర్‌రెడ్డి ఉగాది శుభాకాంక్షలు

నల్లగొండ: శ్రీవిశ్వావసు నామ సంవత్సరం ఉగాది పండుగ సందర్భంగా జిల్లా ప్రజలకు శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు సంవత్సరాది ప్రజలకు అన్ని శుభాలు చేకూర్చాలని ఆకాంక్షించారు.











ఉగాది వినూత్నం

- మోత్కూరులో ప్రతియేటా కొనసాగుతున్న సంప్రదాయం
- నేడు బోనాలు, ఎడ్ల బండ్లతో పండుగకు స్వాగతం


మోత్కూరు: ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడా లేనివిధంగా మోత్కూరులో వినూత్న రీతిలో ఉగాది పండుగ జరుగుతుంది. బోనాలు, ఎడ్ల బండ్లతో తెలుగు నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతారు. గ్రామ దేవతలకు బోనాలు, శివసత్తుల ఆట, పాటలు, ఎడ్ల బండ్ల పరుగులు, యువకుల బైక్ విన్యాసాలు మోత్కూరులో కనువిందు చేయనున్నాయి. సుమారు 90 సంవత్సరాలుగా ఈ ఆచారం కొనసాగుతోంది. ఎడ్ల బండ్లు, వాహనాలను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహిస్తారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో చెరువు కట్టపై కొలువై ఉన్న పెద్ద ముత్యాలమ్మ తల్లి, అంగడి బజార్‌లో కొలువై ఉన్న పడమటి ముత్యాలమ్మ తల్లి ఆలయం వద్దకు మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్తారు. అనంతరం అమ్మవార్లకు బోనాలు సమర్పిస్తారు. ఉగాది రోజు రాష్ట్ర వ్యాప్తంగా షడ్రుచులతో పచ్చడి సేవిస్తుండగా మోత్కూరులో మాత్రం అందుకు భిన్నంగా ఉగాది పచ్చడితో పాటు మద్యం, మాంసాహారం స్వీకరిస్తారు. మరో దసరాగా ఇక్కడ ప్రజలు ఉగాదిని జరుపుకోవడం విశేషం.


మోత్కూరులో ఎడ్ల బండ్ల ప్రదర్శన (ఫైల్)

40ఏళ్లుగా పంచాంగ పఠనం

- యాదగిరి క్షేత్రంలో ప్రతి ఉగాదికి పంచాంగం పఠిస్తున్న సత్యనారాయణ శర్మ

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో దేవస్థాన ప్రధాన పురోహితులు గౌరిభట్ల సత్యనారాయణశర్మ గత 40 సంవత్సరాలుగా ప్రతి ఉగాదికి పంచాంగాన్ని పఠిస్తున్నారు. 1981లో ఎన్ఎంఆర్‌గా యాదగిరి క్షేత్రంలో ఉద్యోగం పొందిన సత్యనారాయణశర్మ, 1985లో ఉగాది రోజున ఆలయంలో మొదటి సారిగా పంచాంగం పఠించడం ప్రారంభించారు. కాగా.. పంచాంగ పఠనానికి ముందు 15 నిమిషాలు శ్రీస్వామి అమ్మవార్లకు పూజలు నిర్వహించి, అనంతరం పంచాంగానికి ప్రత్యేక పూజలు చేస్తారు. ఆ తరువాత 30 నిమిషాల పాటు పంచాంగాన్ని పఠిస్తారు.


నూతన పంచాంగాన్ని చూస్తున్న గౌరిభట్ల సత్యనారాయణ శర్మ

అంతా శుభమే జరుగుతుంది

యాదగిరి క్షేత్రంలో గత 40 ఏళ్లుగా పంచాంగం పఠిస్తున్నా. భక్తుల విశ్వాసానికి అనుగుణంగా పంచాంగ పఠనం ఉంటుంది. ఈ విశ్వావసు నామ సంవత్సరంలో రాష్ట్ర, జిల్లా ప్రజలకు అంతా మంచే జరుగుతుంది. ఆదివారం ఉగాది రోజున సాయంత్రం 5.45గంటలకు యాదగిరి క్షేత్రంలో పూజల అనంతరం పంచాంగ పఠనం ఉంటుంది. శ్రీస్వామి వారు, అమ్మవారి ఆదాయ, వ్యయాల గురించి అధికారులు, భక్తులకు వివరిస్తాం.

– గౌరిభట్ల సత్యనారాయణశర్మ, యాదగిరి దేవస్థాన పంచాంగ కర్త

పంచెకట్టులో తెలుగుదనం

కోదాడ: కొందరి వస్త్రధారణ వారికి ఒక ప్రత్యేకతను తెచ్చి పెడుతుంది. కోదాడకు చెందిన ధనాల వెంగయ్య ఆ కోవకు చెందిన వారే. ఆయన నిత్యం తెల్లటి ఖద్దరు వస్త్రాలతో తెలుగుతనం ఉట్టిపడేలా పంచె కట్టి, భుజాన కండువా వేసుకొని కనిపిస్తారు. అందుకే ఆయన కనపడగానే అందరూ ఎమ్మెల్యే వెంగయ్య అని పిలుస్తుంటారు. వ్యాపారస్తుడైన వెంగయ్య గడిచిన 50 సంవత్సరాలుగా ఇదే విధంగా పంచె నలగకుండా, చొక్కా ముడత పడకుండా చూసుకుంటాడు. పంచెకట్టుతోనే తనకు ఎనలేని గౌరవం లభిస్తుందని, అసలైన తెలుగుతనం ఈ పంచెకట్టులోనే ఉందని చెబుతున్నారు. పండుగలు, శుభకార్యాలతోపాటు ఇంటి నుంచి బయటకు వస్తే తాను పంచెకట్టుతోనే వస్తానని, గడిచిన 50 సంవత్సరాలుగా ఇదేవిధంగా ఉంటున్నానని పేర్కొంటున్నారు.


పంచెకట్టులో ధనాల వెంగయ్య

జీవితంలోనూ షడ్రుచులు

- ఒడిదుడుకులను అధిగమించి.. ఉన్నత స్థానానికి
- పశువుల కాపరి నుంచి డీటీసీఓగా కల్యాణ చక్రవర్తి

నల్లగొండ టౌన్ : ఉగాది షడ్రుచుల తరహాలోనే ఎన్నో ఎత్తు పల్లాలు, బాధలను అధిగమించి కొందరు ఉన్నత స్థానాలను అధిరోహించారు. గ్రామీణ ప్రాంతాల్లో చదువుకుని అనుకున్న లక్ష్యాన్ని సాధించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుని ఉన్నత ఉద్యోగాలు పొందారు. ఆ కోవలోకే వస్తారు నల్లగొండ జిల్లా క్షయనివారణాధికారి (డీటీసీఓ) డాక్టర్ కళ్యాణ చక్రవర్తి. సంస్థాన్ నారాయణపురం మండలం కడేలబాయితండాకు చెందిన కాట్రోత్ జాతర్, అమ్రి దంపతుల రెండవ సంతానమైన కల్యాణ చక్రవర్తి చిన్నతనంలో చదువుకు దూరమై ఏడాదికి రూ.300 జీతానికి పశువుల కాపరిగా చేరాడు. ఆ సమయంలో గ్రామ సర్పంచ్ లోక్యా నాయక్ ఆయనను ఎస్సీ సంక్షేమ వసతిగృహంలో చేర్పించారు. 7వ తరగతి వరకు అక్కడే చదువకుని 8 నుంచి 10వ తరగతి వరకు సర్వేల్ గురుకుల పాఠశాలలో చదివాడు. ఇంటర్ నాగార్జునసాగర్ రెసిడెన్షియల్ కళాశాలలో పూర్తి చేశాడు. 1996 మరదలితో వివాహం అయ్యింది. 1997 గాంధీ మెడికల్ కళాశాలలో చేరి ఎంబీబీఎస్ పూర్తి చేశాడు. 2005లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో కాంట్రాక్ట్ వైద్యాధికారిగా చేరి అంచెలంచెలుగా ఎదిగి ప్రస్తుతం జిల్లా క్షయనివారణాధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇన్‌చార్జి డీఎంహెచ్ఓగా పనిచేసి గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించడంలో కీలకపాత్ర పోషించారు.


డాక్టర్ కళ్యాణ్‌చక్రవర్తి, డీటీసీఓ

చెర్వుగట్టులో అమావాస్య పూజలు

నార్కట్‌పల్లి: మండలంలోని చెర్వుగట్టు గ్రామంలో గల శ్రీపార్వతీ జడలరామలింగేశ్వర స్వామి దేవాలయంలో శనివారం అమావాస్య సందర్భంగా ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా స్వామి వారికి లక్ష పుష్పార్చన, అభిషేకాలు జరిపించారు. అమావాస్య కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి గట్టుపై నిద్రించారు. అనంతరం దైవ దర్శనం చేసుకున్నారు. పూజా కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు పోతులపాటి రామలింగేశ్వర శర్మ, అర్చకులు నాగయ్య శర్మ, సురేష్ శర్మ, సతీష్ శర్మ, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.





హైదరాబాద్ - యాదగిరి టోల్‌వే ప్రైవేట్ లిమిటెడ్ INTERISE

(ఇంటరైజ్ ట్రస్ట్ యొక్క పోర్ట్‌ఫోలియో కంపెనీ)

గూడూరు టోల్‌ప్లాజా, గూడూర్ (పోస్ట్), బీబీనగర్ (మండలం), యాదాద్రి భువనగిరి(జిల్లా), తెలంగాణ-506126

01 ఏప్రిల్ 2025 నుండి వర్తించు మార్పుచేసిన గూడూరు టోల్‌ప్లాజా, వాడకందారు ఫీజు (టోల్) గురించి

NHAI చే చెందిన లెటర్ NHAI/RO-HYD/Hyd-Yad (18.60-54.00)/BOT/Toll/2025/2651 తేది: 22.03.2025 [illegible] NH-163 యొక్క కి.మీ. 18.600 నుండి కి.మీ.54.000 [illegible] వాడకందారుల ఫీజు రేట్లు 01.04.2025 నుండి తెలంగాణ రాష్ట్రంలో గూడూరు టోల్‌ప్లాజా వద్ద (యాదాద్రి భువనగిరి జిల్లా గూడూరు గ్రామం 38.100 కి.మీ) దిగువ విధంగా మార్పులు చేయబడును.

క్ర. సం.	వాహనముల వివరములు	ఫాస్ట్ ట్యాగ్ ద్వారా మాత్రమే		
		సింగిల్ జర్నీ కొరకు ఫీజు (రూ.)	ఒక రోజులో తిరుగు ప్రయాణం కొరకు ఫీజు (రూ.)	నెలసరి పాస్ కొరకు ఫీజు (రూ.) 50 ట్రిప్పులు
1)	కార్, జీప్, వ్యాన్ లేదా లైట్ మోటారు వాహనాలు	120	180	4040
2)	లైట్ కమర్షియల్ వాహనాలు లైట్ గూడ్స్ వాహనం లేదా మినీబస్	185	280	6195
3)	బస్ లేదా ట్రక్ (టూ యాక్సిల్)	375	565	12570
4)	హెవీ కన్‌స్ట్రక్షన్ మిషనరీ (HCM), లేదా ఎర్త్‌మూవింగ్ ఎక్విప్‌మెంట్ (EME) లేదా మల్టీయాక్సిల్ వాహనం (3 నుండి 6 యాక్సిల్స్)	570	855	19045
5)	ఓవర్ సైజ్ వాహనములు (ఏడు లేదా) అంతకుమించిన యాక్సిల్స్ కలిగినవి)	745	1115	24780

GOI ఆదేశం ప్రకారం 15.12.2019 నుండి అన్ని NH టోల్ ప్లాజాలలో ఫాస్ట్‌ట్యాగ్ తప్పనిసరి దీనికి సంబంధించిన సర్క్యులర్ తేది 19.07.2019 మరియు 29.11.2019 మరియు గెజిట్ నోటిఫికేషన్ నెం. G.S.R. 298 NHAI లెటర్ నెం. NHAI/100%FASTAG/2020 తేది: 04.12.2020 మరియు 15.05.2020 కు [illegible]

1. (i) టోల్ ప్లాజా నుండి 20 కి.మీ.ల పరిధిలో [illegible] పాస్ నెలకు రూ. 350/- [illegible]
(ii) [illegible] 24 గం॥లలోగా తిరుగు ప్రయాణం (50% రాయితీ)
(iii) [illegible] ఒక నెలలో 50 లేదా అంతకుమించిన ప్రయాణాలు (33% రాయితీ)
గమనిక: NHAI [illegible] నెం. NHAI/13013/CO/2019-20/147464 తేది: 15.01.2020 మరియు NHAI [illegible] /2018. [illegible] నెం. 17.06.78 తేది. 16.02.2018 ప్రకారం GOI యొక్క ఫాస్ట్‌ట్యాగ్ ప్రోగ్రామ్ ద్వారా మాత్రమే [illegible]
2. ఫీజు నోటిఫికేషన్ తేది 17 జనవరి 2012 S.O. 80 (E) [illegible]
3. [illegible] 10 [illegible]
4. గెజిట్ [illegible] 17 జనవరి 2012 ఆఫ్ S.O. 80 (E) ఫీజు నోటిఫికేషన్ [illegible] వెబ్‌సైట్: http://tis.nhai.gov.in/
5. [illegible]

Concessionaire	IE	PIU-NHAI
[illegible] హైదరాబాద్-యాదగిరి టోల్‌వే ప్రైవేట్ లిమిటెడ్	[illegible] ప్రైవేట్ లిమిటెడ్	ప్రాజెక్ట్ డైరెక్టర్, ప్రాజెక్ట్ ఇంప్లిమెంటేషన్ యూనిట్
గూడూర్ టోల్‌ప్లాజా, గూడూర్ (పోస్ట్) గ్రామం బీబీనగర్ (మండలం) యాదాద్రి భువనగిరి (జిల్లా)-508126	ప్లాట్ నెం. 96, [illegible], భువనగిరి [illegible], యాదాద్రి భువనగిరి (జిల్లా)-508126	[illegible] 1-7-85/8/1బి, [illegible] నల్లగొండ, తెలంగాణ-508001.
73311 09105	99080 22236	0870-2553535









